క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా గురువారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని క్రింద తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రావు తెలిపారు.

- ◆ **ఉదయం 8 నుంచి 11 గంటల వరకు...** ఎంఆర్‌ఓ ఆఫీస్, వీఎస్‌రెడ్డి నగర్, గ్యాస్ కంపెనీ, హెగ్డే నర్సింగ్ హోం, ఆర్‌టీఏ ఆఫీస్, మూసారాంబాగ్ రోడ్, భారత్ పెట్రోల్ పంప్, వివేకానంద స్కూల్, మోర్ మార్కెట్ పరిసర ప్రాంతాలు.
- ◆ **ఉ.10 నుంచి మ.12 గంటల వరకు..** నూర్‌ఖాన్ బజార్, యునైటెడ్ బేకరీ, నూర్ కేఫ్, కోమట్‌వాడి, సెంట్రల్ బ్యాంక్, గరల్స్ హైస్కూల్, దారుషఫా చమన్, హుస్సేనీ మొహల్లా, ఇండియన్ బ్యాంక్, మదీన కాంప్లెక్స్, గోల్‌కబర్, లాల్ మిట్టీ దర్గా పరిసర ప్రాంతాలు
- ◆ **ఉ. 11 నుండి మ 12 గంటల వరకు..** ముస్తానా హాస్పిటల్, ఎస్‌డీఎం స్కూల్, గోల్‌కబర్ పరిసర ప్రాంతాలు
- ◆ **ఉ. 11 నుంచి మ. ఒంటి గంట వరకు ...** గణేష్ టెంపుల్, సలీంనగర్, హీరోహోండా షోరూం వెనుక వైపు, రామాలయం స్ట్రీట్, రామచంద్రా ఐటీఐ, ఇంద్రసేనారెడ్డి పీటీ, శ్రీపురం కాలనీ రోడ్ పరిసర ప్రాంతాలు
- ◆ **మధ్యాహ్నం 3 నుంచి సా. 5 గంటల వరకు..** గురుదాస్, సలీంనగర్, రామారావ్ కంపెనీ, సలీంనగర్ మిల్క్‌బూత్ డౌన్, పద్మావతి అపార్ట్స్, సలీంనగర్ గణేష్ టెంపుల్ పరిసర ప్రాంతాలలో కరెంట్ ఉండదని డీఈ తెలిపారు.

ఎల్బీనగర్ ఏసీపీగా శ్రీధర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



శ్రీధర్‌రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న జానకి రెడ్డి

నాగోలు: ఎల్‌బీనగర్ డివిజన్ ఏసీపీగా జానకి రెడ్డి బుధవారం ఏసీపీ శ్రీధర్ రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జానకి రెడ్డి మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా ఎల్‌బీనగర్ నుంచి బదిలీ అయిన శ్రీధర్‌రెడ్డిని పోలీస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

నాగోలు సీఐకి బీఎస్పీ నాయకుల శుభాకాంక్షలు



సీఐ వెంకటేశ్వర్లుకు సన్మానం చేస్తున్న జక్క యాదగిరి తదితరులు

నాగోలు: డివిజన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన నాగోలు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సీఐ వెంకటేశ్వర్లును బుధవారం ఎల్‌బీనగర్ నియోజకవర్గ బహుజన్ సమాజ్ పార్టీ ఇన్‌ఛార్జి జక్క యాదగిరి కలిసి శుభకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు గువ్వల సాయి, రామకృష్ణ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి వేముగంటి సంపత్, కార్యదర్శి కట్ల కుమార్, అనగలస్వామి, కె.అనిల్ యాదవ్, మహేష్, సుధాకర్ నేత తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- సీపీఐ(ఎంఎల్)ఆర్‌ఐ సిటీ కార్యదర్శి సంతోష్



మన్సూరాబాద్: గత 14 రోజులుగా సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్)ఆర్‌ఐ సిటీ కార్యదర్శి ఆర్.సంతోష్ డిమాండ్ చేశారు. ఎల్‌బీనగర్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 50 వేల మంది పంచాయతీ కార్మికులు రెండు వారాలుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు తీర్పు, 11వ వేతన సవరణ చట్టం ప్రకారం కనీస వేతనం రూ.19 వేలను వెంటనే ఇవ్వాలని కోరారు. కార్మికులతో చర్చలు జరిపి వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

మళ్లీ వరద ముంపు తప్పదా?



నాగోలు గ్రామంలో కొనసాగుతున్న బాక్స్‌టైప్ నాలా పనులు

- నత్తనడకన వరద నీటి నాలా నిర్మాణ పనులు
- రెండేళ్లైనా పూర్తికాని వైనం
- కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నిలిచిన పనులు
- అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే కారణం

నాగోలు: కాంట్రాక్టర్ల...జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం వల్ల సకాలంలో పూర్తి కావాల్సిన వరద నాలా పనులు నత్తనడకన సాగుతున్నాయి. వర్షాకాలం రావడం.. ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో మళ్లీ తమకు వరద ముంపు తప్పేలా లేదని బండ్లగూడ చెరువు కింద ఉన్న కాలనీవాసులు తీవ్ర భయందోళన వ్యక్తం చేస్తున్నారు.

◆ వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ)లో భాగంగా ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో రూ.103 కోట్లతో వరద ముంపు శాశ్వత నివారణకు నాలాల అభివృద్ధి పనులకు రెండేళ్ల క్రితం మంత్రి కేటీఆర్ శ్రీకారం చుట్టారు.

◆ బండ్లగూడ చెరువు నుంచి మూసీ వరకు చేపట్టే ఈ వరద నీటి బాక్స్ టైప్ డ్రెయిన్ నిర్మాణ పనులను గత జూన్ (వర్షాకాలం) లోపే పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్‌ను మంత్రి ఆదేశించినప్పటికీ పనుల పురోగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

◆ జీహెచ్‌ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల ఇప్పటి వరకు 70 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.

◆ గత రెండు, మూడేళ్లలో భారీ వర్షలకు ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని నాగోలు డివిజన్ పరిధిలోని అయ్యప్పకాలనీ, మల్లికార్జుననగర్, శ్రీనివాస్‌కాలనీ, వెంకటరమణకాలనీ, సాయిరాంనగర్ కాలనీ, కొత్తపేట డివిజన్ పరిధిలోని ఎస్‌ఆర్‌ఎల్‌కాలనీ, సత్యానగర్‌కాలనీతో పాటు దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలోని పలు కాలనీలు నీట మునిగాయి.

◆ ఈ నేపథ్యంలో ప్రభుత్వం పెద్ద ఎత్తున బాక్స్‌టైప్ వదర నీరు డ్రైనేజీల నిర్మాణం కోసం శ్రీకారం చుట్టింది.

◆ పనులు సరిగా పూర్తి కాకపోవడం, వర్షాలు కురుస్తుండటంతో చెరువు కింద ఉన్న కాలనీవాసుల్లో మరోమారు ముంపు భయం నెలకొంది.

◆ పై స్థాయి అధికారులు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పనులు సరిగా జరగలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా డ్రెయిన్ గుంతలు...

బాక్స్‌టైపు డ్రెయిన్ నిర్మాణం కోసం నాగోలు గ్రామంలో రోడ్లన్నీ తవ్వి అలాగే వదిలేశారు. బండ్లగూడ రోడ్డుపై కూడా పెద్ద పెద్ద గుంతలు తీసి వదిలేశారు. ఇవి ప్రమాదకంగా మారడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి బాక్స్‌టైప్ డ్రెయిన్ కోసం తీసిన గుంతల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు..

పైప్‌లైన్ల ధ్వంసంతో నెల రోజులుగా ఇక్కట్లు...

గత నెల రోజుల క్రితం నాగోలు గ్రామంలో బాక్స్ డ్రెయిన్ కోసం కాంట్రాక్టర్లు త్వకాలు చేశారు. దీంతో గ్రామంలో ఉన్న డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పూర్తిగా ధ్వంసమై కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల ముందు పెద్ద ఎత్తున్న గుంతలు తీయడంతో ఇళ్లలోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నాగోలు గ్రామంలో రోడ్డు మధ్యలో ఉన్న వరద నీరు నాలా



మమతానగర్ కాలనీలో జరుగుతున్న వరద నీటి నాలా పనులు


ప్రజలను దగా చేయడమే బీఆర్‌ఎస్ అజెండా: సామ



నాగోలు డివిజన్‌లో ఇంటింటికీ పాదయాత్ర చేస్తున్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్ చింతల అరుణ

నాగోలు: తొమ్మిదేళ్ల కేంద్ర ప్రభుత్వ సుపరిపాలనలో ప్రజలకు సురక్షిత పాలన అందిస్తుండగా, తెలంగాణలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసపూరిత పాలన సాగిస్తూ ప్రజలను దగా చేయడమే అజెండాగా పెట్టుకుందని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి విమర్శించారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆయన కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్ యాదవ్‌తో కలిసి బుధవారం నాగోల్ డివిజన్ సాయినగర్ కాలనీలో పాదయాత్ర చేస్తూ స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాగోల్ డివిజన్ పాతబస్తీలో 1999లో ఇంద్రసేనారెడ్డి వేయించిన రోడ్లు, డ్రైనేజీలే ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో జనాభా బాగా పెరిగిందని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైప్‌లైన్ల వ్యవస్థను అభివృద్ధి చేయకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పొంగి రోడ్లపై పారుతున్నదని అన్నారు. రెండేళ్ల క్రితం ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అనేక చోట్ల వరద ముంపునకు ఇళ్లు, కార్లు, నష్టపోయి జనం నానా అవస్థలు పడ్డారని, ముంపు సమస్యను పరిష్కరిస్తామని మున్సిపల్ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అప్పట్లో హడావుడి చేశారు తప్ప ఇప్పటి వరకు ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తి కాలేదన్నారు. ఏడాది క్రితమే కాంట్రాక్టర్లకు బిల్లులు రాక చేతులెత్తేస్తే .. వర్షాలు కురుస్తున్న తరుణంలో బాక్స్‌టైప్ నాలాలు నిర్మిస్తున్న చోటకు వెళ్లి తానే దగ్గరుండి పనులు పూర్తి చేయిస్తున్నట్టు ఎమ్మెల్యే పోజులిస్తూ ఫొటోలు దిగుతున్నాడని ఆరోపించారు. ఈ మోస పూరిత ప్రభుత్వాన్ని గద్దె దింపడం బీజేపీకే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బద్దం బలకృష్ణగౌడ్, సుదర్శన్ రెడ్డి, సంజీవ రెడ్డి, లయ పద్మారెడ్డి, నూకల పద్మా రెడ్డి, జక్క గీత రెడ్డి వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

రాజకీయ, సామాజిక అంశాలపై దృష్టి సారించాలి



విద్యార్థికి మొక్కను బహూకరిస్తున్న నందులాల్

హస్తినాపురం: విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా సామాజిక, రాజకీయ అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నందు ఆర్మీ వ్యవస్థాపకుడు నందులాల్ అన్నారు. హస్తినాపురంలోని రవీంద్రభారతి స్కూల్‌లో ఇన్వెస్టిట్యూర్ సెర్మనీని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన వివిధ విభాగాలకు ప్రతినిధులుగా ఎంపికైన విద్యార్థులకు బ్యాడ్జీలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మంగళగౌరి, డీఐ దయాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటరమణ కాలనీలో...

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని వెంకటరమణ కాలనీలోని రవీంద్రభారతి పాఠశాలలో బుధవారం ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ జగదీష్, డాక్టర్ రణధీర్‌రెడ్డి హాజరై విద్యార్థులకు బ్యాడ్జీలు బహూకరించారు. పాఠశాల జోనల్ డీన్ జ్యోతి, డీఐ దయాకర్, ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివాహిత మృతికి కారణమైన వ్యక్తికి మూడేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: మహేశ్వరం ఠాణా పరిధిలో 2014లో నమోదైన వివాహిత మృతి కేసులో నిందితుడు ఐల వెంకటేశ్ గౌడ్(38)కు రంగారెడ్డి జిల్లా 11వ అదనపు జిల్లా ,సెషన్స్ కోర్టు న్యాయమూర్తి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. ఏపీపీ వొద్యారపు రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మహేశ్వరం మండలం నాగారం గ్రామ పరిధిలోని తండాకు చెందిన కెతావత్ దేవి తన సమీప బంధువు మైసిగండి ఆలయంలో నిర్వహించిన దైవకార్యానికి హాజరైంది. అక్కడి నుంచి తమ గ్రామానికి చెందిన నిందితుడు ఐల వెంకటేశ్ గౌడ్(38) బైకుపై బయలుదేరింది. మార్గం మధ్యలో బైక్ ఆపిన నిందితుడు తన కోరిక తీర్చాలని ఆమెను బలంగా కొట్టాడు. ఆమె అదే సమయంలో అటుగా వెళ్తున్న లారీ వెనుక చక్రాల కింద ప్రమాదవశాత్తు పడి మరణించింది. ఈ ఘటనకు ప్రత్యక్ష సాక్షి అయిన లారీ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసు నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో అభియోగ పత్రం ధాఖలు చేశారు.సాక్షులను విచారించిన న్యాయమూర్తి వై.జయప్రసాద్ నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ బుధవారం తుది తీర్పు వెలువరించారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 75, వంకాయ 23, బెండ 35, పచ్చి మిర్చి 90, కాకర 35, బీర 35, క్యాబేజీ 15, ఫ్రెంచి బీన్స్ 90, క్యారెట్ 50, దొండ 13-18, చిక్కుడు 55, గోకర 28, బీట్‌రూట్ 30, క్యాప్సికం 95, ఆలు 20, దోస 23, సొర 13, పొట్ల 13, ఉల్లిగడ్డ 18, చామగడ్డ 37. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

22న ఆండాళ్ నిలయంలో తిరునక్షత్రోత్సవం



మలక్‌పేట: మూసారంబాగ్‌లోని ఆండాళ్ నిలయంలో ఈనెల 22న అధిక శ్రావణ శుక్ల చవితి సందర్భంగా తిరునక్షత్రోత్సవంగా జరుగుతుందని నిర్వాహకురాలు ఎ.లక్ష్మీదేవి తెలిపారు. తిరునక్షత్రోత్సవం సందర్భంగా అభిషేకం, అలంకారం, పూజలు వైభవోపేతం నిర్వహిస్తామన్నారు. శనివారం ఉదయం 10.30 గంటలకు అభిషేకం తర్వాత అర్చన, తనియ విన్నపం, 108 గంగాళముల(పాత్రలు)లో ప్రసాద నివేదన ఉంటుందన్నారు. తదనంతరం తీర్థప్రసాద గోష్టి, వడినింపే కార్యక్రమం ఉంటుందన్నారు. వైదిక సంస్కృతి, సంప్రదాయాన్ని పరిరక్షించడంలో అందరూ భాగస్వాములు కావాలని ఆమె కోరారు.

కారుబోల్తా.. ముగ్గురికి గాయాలు

కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మేడిపల్లి వద్ద జాతీయ రహదారిపై బుధవారం కారు అదుపుతప్పి బోల్తాపడడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని డీఆర్‌డీఓ కార్యాలయంలో సైంటిస్ట్‌గా పనిచేస్తున్న ఈదుపుగంటి భూషణ్‌రావు తన ఇద్దరు సోదరులతో కలిసి తండ్రి అస్తికలను గోదావరిలో నిమజ్జనం చేసేందుకు కారులో కాళేశ్వరం వెళ్తున్నారు. మార్గమధ్యలో మేడిపల్లి వద్దకు రాగానే అకస్మాత్తుగా ఆటో అడ్డురావడంతో తప్పించబోయాడు. అదే సమయంలో ఎదురుగా లారీ రావడంతో కారు రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తాపడింది. కారులో ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి.

రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయించండి



సత్యానగర్ కాలనీలో బురదమయంగా మారిన రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్ల పనులు పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులను కోరారు. కొత్తపేట డివిజన్ సత్యానగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బాక్స్ డ్రైనేజీ పనులు పూర్తయినా రోడ్లకు ఇంకా మరమ్మతులు చేయలేదు. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న కార్పొరేటర్ పవన్ కుమార్ బుధవారం కాలనీలో పర్యటించారు. రోడ్డు లేక పోవడంతో వర్షాకాలంలో మొత్తం బురదగా మారి నడవడానికి కూడా వీలు లేకుండాపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కార్పొరేటర్‌కు స్థానికులు తెలిపారు. వెంటనే ఆయన స్థానిక ఏఈ మాత్య నాయక్ ఫోన్ చేసి బాక్స్ డ్రైనేజ్ పనులు పూర్తయినా ఇంకా రోడ్లకు ఎంతుకు మరమ్మతులు చేయించడం లేదని ప్రశ్నించారు. వర్షాల వల్ల రోడ్లన్నీ బురదగా మారి ప్రజలు నడవలేని స్థితిలో ఉన్నారన్నారు. వెంటనే రోడ్లకు మరమ్మతులు చేయించాలని, లేదా కొత్తగా రోడ్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో సత్యనగర్ కాలనీ అధ్యక్షుడు శుక్లా, రమణ, మంచి రాజేష్, రామకృష్ణ, కొత్త తిరుమల, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో కృషి చేసి పార్టీని గెలిపిద్దాం

బీజేపీ నేత ఇంద్రసేనారెడ్డి



టిఫిన్‌బాక్స్ బైఠక్‌లో మాట్లాడుతున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి

సైదాబాద్: నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా కృషి చేసి తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపిద్దామని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే ఇంద్రసేనారెడ్డి అన్నారు. బుధవారం సైదాబాద్ డివిజన్ జీఏ కాలనీలోని శ్రీనివాస కమ్యూనిటీహాల్‌లో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మలక్‌పేట నియోజకవర్గ పార్టీ నాయకులతో నిర్వహించిన టిఫిన్ బాక్స్ బైఠక్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో అన్నివర్గాల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అదే విధంగా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక పాలన గురించి ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగాల హరిగౌడ్, కొత్తకాపు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినతి



విద్యుత్ సమస్యలను ఏడీఈకి వివరిస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శివారు కాలనీల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని బుధవారం స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి వనస్థలిపురం ఏడీఈ రాంచద్రయ్యను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ, డివిజన్‌లో శివారు కాలనీల్లో విద్యుత్ సమస్యలతో కాలనీల వాసులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పలు ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు సబ్‌స్టేషన్ కూడా అవసరం ఉందన్నారు. వెంటనే ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన కోరారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో దివ్యాంగుల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్‌లోని క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం నియోజకవర్గం పరిధిలోని దివ్యాంగులు, అధికారులతో కలిసి ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఇప్పటికే రూ.3016 ఉన్న పింఛన్‌ను రూ.4016 చేశారని తెలిపారు.డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ ఉందని, మొదట వారికి ఇచ్చిన తర్వాతే మిగతా వారికి ఇవ్వాలని ఆయన అధికారులను కోరారు. దివ్యాంగుల్లో దళితులు ఉంటే వెంటనే దళితబంధుకు దరఖాస్తు చేసుకోవాలని, వారికి పథకం వర్తింపజేసేలా చర్యలు తీసుంటానని తెలిపారు. 2016 చట్టం ప్రకారం దివ్యాంగులకు రావాల్సిన కోటాను తన నియోజకవర్గంలో అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే చెప్పారు. సంక్షేమ పథకాలతో పాటు నామినేటెడ్ పోస్టుల్లో కూడా వారికి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. త్వరలో సంబంధిత అధికారులతో కలిసి వర్క్ షాప్ నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు రాజేశ్వర్‌రెడ్డి, విక్రాంత్, రాజేష్, బలరాం, అశ్వినికుమారి, హయత్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు మద్దెల గంగారాం, నాగభుషన్, రాంబాబు, నాగేశ్వరరావు, నాగరాజు, రామచందర్, వేణు, కోటి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షాలతో అవస్థలు

- కాలనీల్లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- పలుచోట్ల స్తంభించిన ట్రాఫిక్

దిల్‌సుఖ్‌నగర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మలక్‌పేటజోన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలు జలమయం అయ్యాయి. వర్షం నీరు కాలనీల్లోని డ్రైనేజీలు పొంగి మురుగు రహదారులపై ప్రవహించింది. ఫలితంగా దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, మూసారంబాగ్ చౌరస్తా, నల్గొండ క్రాస్‌రోడ్డుల్లో ట్రాఫిక్ స్తంభించింది. అంతటా ప్రధాన రహదారులు జలమయంగా మారాయి. వర్షానికి జోన్‌పరిధిలోని అల్కాపురి, మార్గదర్శికాలనీ, టెలిఫోన్‌కాలనీ, దిల్‌సుఖ్‌నగర్, శంకేశ్వరబజార్, అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట్, అజంపుర, సైదాబాద్, సరూర్ నగర్, ఆర్‌కేపురం, ఐఎస్‌సదన్, కొత్తపేట తదితర ప్రాంతాలు జలమయంగా మారాయి. కొన్ని కాలనీల్లో విద్యుత్ నిలిచిపోయింది. కురుస్తున్న వర్షానికి ముంపు ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు. కాలనీల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురైన వెంటనే కాలనీవాసులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫోన్ చేయాలని, అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



ఆర్‌కేపురంలో ప్రవహిస్తున్న వర్షపునీరు